సర్వజన ఆస్పత్రిలో సంతృప్తికర సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పరిశీలన
- ఎమర్జెన్సీ వార్డులో ఏసీలు పని చేయకపోవడంతో ఆగ్రహం

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సంతృప్తికర సేవలు అందుతున్నాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. స్థానిక సర్వజన ఆస్పత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా క్యాజువాలటీ, ఎమర్జెన్సీ వార్డులను పరిశీలించారు. ఎమర్జెన్సీ వార్డులో ఏసీలు పని చేయడం లేదని రోగి బంధువులు కోలగట్లకు తెలిపారు. దీంతో ఎలక్ట్రీషియన్ వర్క్సపై ఆగ్రహం చేశారు. ఎండ తీవ్రతను రోగులు ఏవిధంగా తట్టుకోగలరు, ఏసీలు పని చేయకపోతే ఎందుకు ఇంతవరకు పట్టించుకోలేదు, ఈ విషయాన్ని అధికారులకు తెలియజేసావా? అని మండిపడ్డారు. తక్షణమే ఏసీలు అన్ని పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కోట్లాది రుపాయిలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. దానికి అనుగుణంగా బాధ్యతయుతంగా పని చేయాలని సూచించారు. రోగులకు చిన్నపాటి అసౌకర్యం కల్గినా ఉపేక్షించేది లేదన్నారు. తరువాత ఐసీయూను పరిశీలించారు. అక్కడ కూడా ఏసీలు సక్రమంగా పని చేయకపోవడంతో వాటిని కూడాఅందుబాటులోకి తీసుకురావాలని ఎలక్ట్రీషియన్‌కు ఆదేశించారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని చెప్పారు. అనంతరం ఆయన వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు వైద్య పరంగా ఎటువంటి ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి జిల్లాకు వైద్య కళాశాలను మంజూరు చేశారని తెలిపారు. అందులో భాగంగా విజయనగరం జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల రావడం వల్ల రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. చిన్న చిన్న లోటు పాట్లు ఉన్నాయని వాటిని సరి చేస్తామని తెలిపారు. ఘోషాస్పత్రిలో రాష్ట్రంలోని మిగతా ఆస్పత్రుల్లో కంటే అధికంగా ప్రసవాలు జరుగుతున్నాయని అన్నారు. వైద్యులు డ్యూటీ సమయంలో ఆస్పత్రిలోనే ఉండాలని, ఇతర అవసరాలకు కేటాయించకూడదని చెప్పారు. కరోనా వ్యాధి మళ్లీ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ఎటువంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. వైద్య కళాశాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. అన్ని రకాల సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, ఆర్ఎంఓ డాక్టర్ సురేష్‌కుమార్, ఏపీఎంఐడీసీ ఎస్ఈ సుకుమార్, ఈఈ సత్య ప్రభాకర్, డాక్టర్ వీఎస్ ప్రసాద్, డాక్టర్ బోళం పద్మావతి, రామేశ్వరపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా కీలకమైన అడుగులు

- మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు



విజయనగరం: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేయనున్న భావనపాడు పోర్ట్ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కీలకం కానుందనీ మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి డీవీజీ శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దశాబ్దాల ఉత్తరాంధ్ర వాసుల కలకు సాకార రూపం అందించడం ద్వారా రాష్ట్ర ప్రగతి చిత్రాన్నే ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి అభినందనీయులనీ కొనియాడారు. దేశంలో రెండో పొడవైన తీర ప్రాంతం ఉన్న ఆంధ్రప్రదేశ్ నూతన వాణిజ్య అవకాశాల కోసం దాన్ని పూర్తిగా వినియోగించుకోవాలనీ ఆకాంక్షించారు. ఇంతవరకూ తూర్పు తీర ప్రాంతానికి విశాఖపట్నం ఒక్కటే పోర్ట్ కలిగి ఉందన్నారు. మూలపేట పోర్టుగా నామకరణం గావించబడ్డ భావనపాడు పోర్టు నిర్మాణం త్వరితగతిన పూర్తయితే మత్స్య సంపద, గ్రానైట్ ఇతర ముడి సరుకుల ఎగుమతులు, దిగుమతులు సులభతరమై విదేశీ మారక ద్రవ్యం నిల్వలు పెరుగుతాయని వివరించారు. రాష్ట్రానికి, కేంద్రానికి అదనపు ఆదాయం పెరగడమే కాకుండా స్థానికంగా ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలు భారీగా అందివస్తాయని తెలిపారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతపు పారిశ్రామిక రూపురేఖలు మారడంతో పాటు రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం లభిస్తుందనీ ఆశాభావం వ్యక్తం చేశారు. పోర్టుతో పాటు వ్యవసాయానికి ఊతమిచ్చే లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి, ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల మొదటి వారంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా శంకుస్థాపన చేయనుండడం శుభపరిణామమని పేర్కొన్నారు.

పెళ్లికి పెద్దల సహకారం

విజయనగరం: మూడు ముళ్ల బంధంతో రెండు మనసులు కలసి జీవితకాలం ఒక్కటిగా జీవించడమే పెళ్లి యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తుందని జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ వ్యవస్థాపకులు ఆలవెల్లి శేఖర్ అన్నారు. ఆర్యవైశ్య సంఘం భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దత్తిరాజేరు మండలం విజయరామపురం గ్రామ నివాసి గ్రంధి మహేష్‌కుమార్ తన కుమార్తె ఇందు వివాహం నిమిత్తం చారిటీ గ్రూపును కలసి వారి ఆర్థిక పరిస్థితిని వివరించారనీ, దానికి స్పందించిన జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూపు సభ్యుల సహకారంతో రూ.35,000 సమకూర్చినట్లు చెప్పారు. పెళ్లి కుమార్తెకు శతమానం, కాలు కడిగే సామానులు, సారి కోసం స్టీల్ సామానులు, దుస్తులు, 15 వేల రూపాయలు నగదు పెళ్లి కుమార్తె తండ్రికి అందజేశారు. కార్యక్రమంలో చారిటీ గ్రూపు నిర్వాహకులు డిమ్స్ రాజు, మాచర్ల చంద్ర శేఖర్ గుప్త, బి.పి.ఎస్.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ బ్యాంక్‌ల పాత్ర కీలకం



ఫుడ్ బ్యాంక్‌లో పేదలకు ఆహారాన్ని పంపిణీ చేస్తున్న సీఈఓ

- డీసీసీబీ సీఈఓ కెంబూరి

విజయనగరం: నగరంలో అన్నార్తుల ఆకలి బాధలను తీర్చుతున్న ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు కావడం ముదావహమని డీసీసీబీ సీఈఓ కెంబూరి జనార్దన్‌రావు అన్నారు. కోట జంక్షన్ వద్దనున్న ఫుడ్ బ్యాంకులో మంగళవారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పేదల కోసం ఐదు ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సలహాలు సూచనలతో నిరాటంకంగా ఫుడ్ బ్యాంకులు నిర్వహణ కావడం గొప్ప విషయం పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఎవర్న కుమారస్వామి మాట్లాడుతూ నగరంలో ఫుడ్ బ్యాంకులు ద్వారా ప్రతిరోజు 800 మంది వరకు పేదలకు ఉచిత అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హోటల్ చంద్రాస్ యజమాని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభతో సమస్యల పరిష్కారం



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మి

విజయనగరం రూరల్: గ్రామసభలు నిర్వహించడం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని దుప్పాడ గ్రామ సర్పంచ్ కరుమజ్జి లక్ష్మి అన్నారు. మండలంలోని దుప్పాడ గ్రామ సచివాలయంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలో ఇంటింటికీ రూ.44 లక్షలతో కుళాయి ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతున్నామని, వీధి దీపాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో చేపట్టబోయే అభివృద్ధి ప్రణాళికను సభలో వివరించారు. జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, పంచాయతీ కార్యదర్శి టి.వెంకటరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



రావాడ పంచాయతీ గొల్లపేటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం భోగాపురం మండలం గొల్లపేటలో మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని అభ్యర్థించారు.

– భోగాపురం

విద్యార్థుల ఉన్నతికి ఎంఓయూ దోహదం

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఎంఓయూలు దోహదపడతాయని సెంచూరియన్ వీసీ జీఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్, ఏలూరు ఆంధ్రా ఆస్పత్రి మధ్య వర్చువల్ విధానంలో మంగళవారం ఎంఓయూ కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, పారా మెడికల్ డీన్ లక్ష్మీనరసింహాచార్యులు, ఆస్పత్రి ఎండీ హరీష్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



కొండవెలగాడలో బోరు మరమ్మతులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల రూరల్: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ గిరిబాల అన్నారు. మండలంలోని కొండవెలగాడ గ్రామంలో జరుగుతున్న క్రాష్ ప్రోగ్రాంను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో పల్లెల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం క్రాష్‌ప్రోగ్రాంకు శ్రీకారం చుట్టిందన్నారు. పాడైన బోర్లను రిపేరు చేసి వినియోగంలోకి తీసుకువస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో ఆ విధమైన సమస్యలు ఉంటే సచివాలయ సిబ్బందికి చెప్పాలని సూచించారు. వారు స్పందించకపోతే సమస్యను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. అన్ని గ్రామాల్లో క్రాష్ ప్రోగ్రాం పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భానోజీరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఆర్ కళాశాలలో ధరిత్రి దినోత్సవం



పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరిస్తున్న చీఫ్ సైంటిస్టు డాక్టర్ ప్రభాకర్‌రావు

విజయనగరం అర్బన్: మహరాజా అటానమస్ కళాశాలలో ధరిత్రి దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. కళాశాల భౌతికశాస్త్ర విభాగం అధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయిన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ సంస్థ చీఫ్ సైంటిస్టు డాక్టర్ ఎంఆర్‌కే ప్రభాకర్‌రావు మాట్లాడుతూ భూమి పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా భూమి గమనం, భూమిలోని పొరలు, అధ్యయనంలో వివిధ భాగాలు, భూ భౌతిక పరిశోధన వల్ల కలిగే లాభాలు తదితర అంశాలపై అవగాహన కలిగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కో–ఆర్డినేటర్‌గా డాక్టర్ పి.గణపతిరావు వ్యవహరించారు. భౌతికశాస్త్ర విభాగాధిపతి పీఎస్ఎన్ రావు, సీనియర్ అధ్యాపకులు జి.ఆనంద్, వీవీ లక్ష్మి, సహ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం



పెట్రోల్ బంక్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

విజయనగరం క్రైమ్: పెట్రోల్ బంకుల్లో పనిచేసే సిబ్బందికి అగ్నిప్రమాదాలు సంభవించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కె.వినయ్, పట్టణ అగ్నిమాపక శాఖ అధికారి వి.సోమేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో పని చేసే సిబ్బందికి అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలను అదుపు చేసే ప్రక్రియలపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ వాహనదారులకు పెట్రోల్ పోసేటప్పుడు సెల్‌ఫోన్ వాడకుండా చూడాలని, ప్రమాదాలు సంభవించేటప్పుడు ఇసుకను అందుబాటులో ఉంచుకోవడం, నివారణా పరికరాలను ఉపయోగించే విధానంపై అవగాహనకల్పించామన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక, పెట్రోల్ బంక్ యాజమాన్యం, సిబ్బందిపాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన



ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

- నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మోపాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అప్పలనాయుడు తదితరులు ఇంటింటికీ సంక్షేమ పథకాల ద్వారా అందిన ఆర్థిక ప్రయోజనాలను వివరించి, అందుకు సంబంధించిన బుక్‌లెట్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ క్యాలెండర్‌ను నెలలతో పాటు ప్రకటించి పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు తెచ్చారని వివరించారు. మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలన్న లక్ష్యంతో విడతల వారీగా రుణమాఫీ డబ్బులను అందిస్తున్నారన్నారు. జగనన్న కాలనీల ద్వారా ఇల్లు లేని పేదలకు గూడు కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల మంజూరులో ఎలాంటి వివక్షకు తావు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వరూపారాణి, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బడ్డుకొండ రమేష్, పలు శాఖల అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్ విజయలక్ష్మి

- 7వ డివిజన్‌లో రూ.33.50 లక్షలతో శంకుస్థాపనలు

విజయనగరం: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని విజయనగరం నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. 7వ డివిజన్ దాసన్నపేట ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మంగళవారం శంకుస్థాపన చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా వినతులను స్వీకరించి వాటిని పరిష్కరించటంలో భాగంగా 33.50 లక్షల రూపాయలతో కాపువీధి, ఆల్తివీధి, గొల్లవీధి, యాతవీధి, పీసలవీధి, నాగవంశం వీధి ప్రాంతాలలో రహదారులు, కాలువలు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నగర మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి అంటే ఏంటో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేసి చూపిస్తున్నారని అన్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం, అవి పూర్తయ్యే విధంగా పర్యవేక్షించడం, వాటిని ప్రారంభోత్సవాలు చేయడం దినచర్యగా చేసుకుని అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. స్థానిక కార్పొరేటర్ పొంతపల్లి మాలతి మాట్లాడుతూ తమ డివిజన్‌లో ఇప్పటికే 2 కోట్ల రూపాయల మేర అభివృద్ధి పనులు జరిగాయని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, జోనల్ ఇన్‌చార్జిలు బొద్దాన అప్పారావు, బోడ సింగి ఈశ్వరరావు, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పారదర్శక పాలన జగనన్నతోనే సాధ్యం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనను అందిస్తున్నారని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని గుంకలాం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ కోలగట్ల, అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరైన సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రజలతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలుతో లబ్ధి పొందిన మొత్తాన్ని లబ్ధిదారులకు వివరించారు. గ్రామంలో నాడు – నేడు పథకంలో పాఠశాల అభివృద్ధి, గ్రామ సచివాలయ నిర్మాణం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాల మంజూరు, పలు అభివృద్ధి పనుల నిర్మాణాలు ప్రజలకు తెలిపారు. ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందించి దేశానికి ఆదర్శంగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడుకెల్ల త్రినాథ్, గ్రామ సర్పంచ్ కునుకు వెంకటరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, పార్టీ నాయకులు జగ్గునాయుడు, మండల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

23న ప్రవేశ పరీక్ష

నెల్లిమర్ల: పట్టణ పరిధిలోని వేణుగోపాలపురంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో ఈ నెల 23వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె ఉషా రాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు పరీక్ష ఉంటుందన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హెచ్‌టిటిపి://ఏపీజీపీసెట్.ఏపీజీపీసెట్.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా హాల్ టిక్కెట్లను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఓఎంఆర్ షీట్‌లో బ్లూ, బ్లాక్ బాల్ పెన్‌తో మాత్రమే బబ్లింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. 5వ తరగతి పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులంతా 30 నిమిషాల ముందుగానే హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్లలో గల బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదవ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 23న ప్రవేశ పరీక్ష జరగనున్నట్టు ప్రిన్సిపాల్ బివి.పూర్ణచంద్రరావు తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా పైడితల్లి చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలానక్షత్రం పురస్కరించుకుని మంగళవారం స్థానిక మూడు లాంతర్ల వద్దనున్న చదురుగుడి ఆవరణలో చండీయాగం నిర్వహించారు. వేదపండితులు వెలువపల్లి నరసింహమూర్తి, సాయి, తాతా రాజేష్, దూసి శివప్రసాద్ లు శాస్త్రోక్తంగా యాగ ప్రక్రియను నిర్వహించారు. యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'అరబిందో' వితరణ



బాధిత కుటుంబాలకు చెక్‌లు అందజేస్తున్న అరబిందో ప్రతినిధులు

పూసపాటిరేగ: సముద్రంలో వేట చేస్తూ అనుకోని ప్రమాదంలో మృత్యువాత పడిన మూడు కుటుంబాలుకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ వితరణగా రూ.9 లక్షల చెక్కులను బాధిత కుటుంబాలకు మంగళవారం అందజేశారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ యాజమాన్య ప్రతినిధి నిత్యానందరెడ్డి ఆదేశాల మేరకు బాధిత చింతపల్లి గ్రామానికి చెందిన బర్రి అప్పయ్యమ్మ, సూరాడ అప్పయ్యమ్మ, బెవర దానయ్యమ్మకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బర్రి చినఅప్పన్న, అరబిందో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



మాట్లాడుతున్న సర్పంచ్ గణేష్ తదితరులు

పూసపాటిరేగ: తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కందివలస గ్రామంలో సర్పంచ్ దేశెట్టి గణేష్ అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టుట, మిషన్ వాత్సల్య, స్వమిత్వ పథపై పంచాయతీ సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చాపల సత్తిబాబు, వైస్ సర్పంచ్ రౌతు సత్తిబాబు పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు విభిన్న ప్రతిభావంతుల శిబిరం

డెంకాడ: విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా ఉపకరణాల పంపిణీ చేసేందుకు గుర్తింపు శిబిరాన్ని డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ స్వరూపారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వంతో గుర్తించబడిన కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం అలిమ్‌కో సాయంతో గుర్తిస్తామన్నారు. ఎంపికైన వారికి మూడు చక్రాల సైకిళ్లు, వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు, బ్యాటరీ ఆపరేటింగ్, మూడు చక్రాల బండి తదితర ఉపకరణాలను విభిన్న ప్రతిభావంతులకు అందజేయనున్నామన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలో డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం, నెల్లిమర్ల మండలాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులందరూ శిబిరానికి హాజరు కావాలని కోరారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

విజయనగరం రూరల్: పాలిసెట్ – 2023 ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత కోచింగ్ అందిస్తున్నామని ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి మంగళవారం తెలిపారు. విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కోచింగ్ అందించడం జరుగుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

శాస్త్రీయమైన పాఠ్యాంశాలను తొలగించడం సరికాదు

విజయనగరం ఫూల్‌బాగ్: ఎన్‌సీఈఆర్‌టీలో శాస్త్రీయమైన పాఠ్యాంశాలను తొలగించడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.వెంకటేష్, పి.రామ్మోహన్‌రావు అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కోట వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డి రాము, సోమేష్, జగదీష్, సౌమ్య, సంధ్య, లావణ్య, రమేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రతల్లో తస్మాత్..

విజయనగరం టౌన్: అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరని గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ నారాయణరావు తెలిపారు. ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ జారీ చేసిన కరపత్రాలను విద్యార్థులకు, తల్లిదండ్రులకు, సిబ్బందికి మంగళవారం అందజేశారు.